క్లుప్తంగా

గోతులతో ఇక్కట్లు



పెదమానాపురం వంతెన వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం ఆర్‌ఓబీ వద్ద నిర్మించిన తాత్కాలిక రోడ్డంతా గోతులేర్పడడంతో వాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

చీపురుపల్లి: చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని వంగపల్లిపేటకు వెళ్లే రహదారిలో విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వెళ్లే తీగలు ప్రమాదకరంగా మారడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ వందలాది మంది ఈ రోడ్డుమీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పంపిణీకి సిద్ధంగా పాస్‌పుస్తకాలు



తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న పాస్ పుస్తకాలు

గుర్ల: మండలంలో భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు పంపిణీ చేసేందుకు కొత్త పాస్ పుస్తకాలు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నాయి. వాటిని లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెలలోపు పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

పశువులకు గర్భకోశ చికిత్సలు



పశువులకు గర్భకోశ చికిత్స చేస్తున్న వైద్యాధికారి గాయత్రి

వేపాడ: వర్షాకాలంలో పశువుల సంరక్షణపై పాడిరైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి కోరాడ గాయత్రి సూచించారు. మండలంలోని కుమ్మపల్లిలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 పశువులకు చికిత్స అందించారు. అలాగే వర్షాకాలంలో పశువుల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గజపతినగరంలో వర్షం



గజపతినగరంలో వర్షంలో బస్సు ఎక్కేందుకు పరుగులు తీస్తున్న మహిళలు

గజపతినగరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం వల్ల మండల కేంద్రంతో పాటు పలు చోట్ల విస్తారంగా వర్షాలు కురిశాయి. గజపతినగరం, పాతబగ్గాం, కొత్తబగ్గాం, బంగారమ్మపేట, భూదేవిపేట, గంగచోళ్లపెట,తదితర గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. వర్షానికి ప్రయాణికులు ఇబ్బంది పడినా, సాగుకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

నేత్ర శస్త్ర చికిత్సకు 20 మంది ఎంపిక

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన నేత్ర వైద్య శిబిరానికి హాజరైన 180 మందిలో వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 20 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి హాజరైన ప్రతి ఒక్కరి కళ్లను వైద్య సిబ్బంది క్షుణ్నంగా తనిఖీలు చేసి, ఏవైనా సమస్యలుంటే చెప్పి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

వర్షాల్లేక.. కరెంటు ఉండక..



చీపురుపల్లి మండలంలోని పర్ల గ్రామంలో నీరు లేక ఎండిపోతున్న వరి పంట పొలాల వద్ద దిగాలుగా రైతులు

- ఎండిపోతున్న వరి, అపరాల పంట పొలాలు
- ఆకాశం వైపు చూస్తున్న అన్నదాతలు
- పల్లెల్లో ఇష్టారాజ్యంగా విద్యుత్ కోతలు
- నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు

చీపురుపల్లి: వాతావరణ పరిస్థితుల్లో చాలా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం ఆగస్టు నెలలో ఉన్నప్పటికీ ఏప్రిల్, మే నెలల్లో ఉన్నట్లు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఉక్కబోతతో ఉండలేని పరిస్థితులు నెలకొంటుండగా.. మరోవైపు వర్షాల్లేక, విద్యుత్ కోతలతో పంటలకు నీటి తడులు అందించలేని పరిస్థితి నెలకొంది. దీంతో అన్నదాతలు వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. ప్రస్తుతం ఇబ్బడి ముబ్బడిగా ఉభాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో సాగునీరు అందించాల్సిన అవసరం ఉంది. కరుణించాల్సిన వరుణుడు కూడా ముఖం చాటేస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి వ్యవసాయాలకు నిరంతర విద్యుత్ సరఫరా జరిగితే కనీసం బోరుబావుల ద్వారా అయినా పంటలకు నీటి తడులు అందించే అవకాశం ఉంటుంది. అయితే ఇష్టారాజ్యంగా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



పర్ల గ్రామంలో సాగులో ఉన్న వేరుశనగ పంట

నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో ప్రస్తుతం వరి పంటతో పాటు వేరుశనగ వంటి పంటలు సాగులో ఉన్నాయి.

ఇష్టారాజ్యంగా విద్యుత్ కోతలు..

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని గ్రామీణ ప్రాంతల్లో విద్యుత్ కోతలు ఇష్టారాజ్యంగా ఉన్నాయని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లతో పాటు వ్యవసాయాలకు కూడా విద్యుత్ సరఫరా ఉండడం లేదు. మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా ఉంటే ఆరు గంటలు కోత విధిస్తున్నారు. వ్యవసాయ బోర్లు ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరా నిరంతరాయంగా లేకపోవడంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఎండలు మండిపోతుండడంతో ఇళ్లల్లో ఉండలేని పరిస్థితులు నెలకొంటున్నాయని.. ఈ పరిస్థితుల్లో విద్యుత్ కోతలతో మరింత అవస్థలు పడాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



గ్రామాల్లో విద్యుత్ కోతలు అధికమయ్యాయి. ఎప్పుడు సరఫరా ఉంటుందో, ఎప్పుడు ఉండదో కూడా తెలియడం లేదు. ఓ వైపు వర్షాల్లేక పంటలు ఎండిపోతున్నాయి. వ్యవసాయ బోర్లు ఉన్నప్పటికీ కరెంటు కోతలతో బోర్లు ఉండి కూడా ప్రయోజనం లేకుండా పోతోంది. ఇళ్లల్లో ఉక్కబోతలతో అవస్థలు పడుతున్నాం.

– కొర్నాన అప్పన్న, అర్తమూరు, గరివిడి మండలం

వారంతా 'జిందాల్' మాయలో ఉన్నారు..



భోజన ప్లేట్లతో నిరసన తెలియజేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట : జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు జిందాల్ మాయలో ఉన్నారని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆరోపించారు. ఈ మేరకు బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులతో కలిసి శనివారం ఆందోళన చేపట్టారు. భోజనం పేట్లు పట్టుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు వాస్తవాలు తెలుసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం జగన్ మాట్లాడుతూ.. భూసేకరణలో జిందాల్ చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. ఇప్పటికే పలు ప్రజాసంఘాలు, రాజకీయ పక్షాల నేతలు జిందాల్ నిర్వాసితుల కష్టాలు తెలుసుకుని సంఘీభావం తెలియజేశారన్నారు. అయితే జిల్లా అధికారులు, నాయకులకు మాత్రం వాస్తవాలు కనిపించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు.

పెండింగ్ బిల్లుల పంపిణీ

లక్కవరపుకోట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గతంలో నిర్వహించిన మినీ గోకులాలు, కాలువలు, సీసీ రోడ్డులకు సంబంధించి ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేసింది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తన స్వగృహం వద్ద లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఈఎస్ పీడీ శారదాదేవి, పంచాయతీరాజ్ డీఈ స్వామినాయుడు, ఐదు మండలాలకు చెందిన ఉపాధిహామీ ఏపీఓలు పాల్గొన్నారు.

కోనూరులో కొట్లాట

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు గ్రామంలో వినాయక విగ్రహం ఏర్పాటు విషయమై వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గాల మధ్య శనివారం వాగ్వాదం చోటుచేసుకుంది. ఇది క్రమంగా కొట్లాటకు దారితీసింది. గ్రామంలోని మంత్రివీధిలో వినాయకుడి ఏర్పాటు విషయమై జరిగిన కొట్లాటలో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకున్నారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా..

కృష్ణాష్టమి సంబరాలు వాడవాడలా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో అలరించారు. పలుచోట్ల అన్నదాన శిబిరాలతో పాటు ఉట్టికొట్టే సంబరాలు నిర్వహించారు. యువత ఉట్టికొట్టేందుకు పోటీ పడగా.. సంబరాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



శృంగవరపుకోట: వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామికి సమర్పించిన 106 రకాల నైవేద్యాలు



దత్తిరాజేరు: మరడాం శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు



జామి: భీమసింగిలో వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి పూజలు



వేపాడ: కృష్ణారాయుడుపేటలో ఉట్టికొడుతున్న సర్పంచ్ బాలబాబు, పెద్దలు బోజంకి శ్రీను



కొత్తవలస: అప్పన్నపాలెం గ్రామంలో అన్నసమారధన నిర్వహిస్తున్న భక్తులు



గంట్యాడ: తామరాపల్లిలో శ్రీకృష్ణుని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



వేపాడ: మండల కేంద్రంలో రుక్మిణీ సత్యభామ సమేత గోపాలకృష్ణుని పాలాభిషేకం చేస్తున్న భక్తులు



కొత్తవలస : దేవాడలో కృష్ణుడికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు



శృంగవరపుకోట: జన్మాష్టమి సంబరాల్లో శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు

రహదారులు అధ్వానం

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బీటీ రోడ్లతో పాటు సిమెంట్ రోడ్లు అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పంచాయతీలకు రావాల్సిన 14వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో సిమెంట్ రోడ్లు, కాలువల నిర్వహణ పనులు చేపట్టడం లేదు. పట్టణ నడిబొడ్డున ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రామాంజనేయ కాలనీకి వెళ్లే సిమెంట్ రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారింది. ఇదే రోడ్డులో ప్రతి శుక్రవారం వారపు సంత కూడా నిర్వహిస్తుంటారు. దీంతో ఈ రోడ్డులో ప్రయాణించే వారితో పాటు సంతకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. పంచాయతీలకు నిధులు విడుదల చేస్తే రహదారులకు మరమ్మతులు చేపడతారని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



గోతులమయమైన రామాంజనేయకాలనీ సీసీ రోడ్డు

ఓటర్లను చైతన్యపరచడమే లక్ష్యం

శృంగవరపుకోట: ఓటర్లను చైతన్యపరచి వారికి తమ హక్కులు, విధులు, బాధ్యతలను తెలియచెప్పడమే లక్ష్యంగా ఓటరు అక్షరాస్యత వేదిక పనిచేస్తోందని వేదిక అధ్యక్షుడు సూర్యారావు తెలిపారు. ఓటరు అక్షరాస్యత వేదిక ద్వితీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం రాత్రి స్థానిక లైబ్రరీలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వైద్యులు ఆర్.త్రినాధరావు, పి.వరలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఓవరాల్ విజేతలైన జి.భవిష్య, బి.తేజస్విని, బి.ఊహలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ డి.శ్రీధర్, మోహన్‌రావు, చిన్నికృష్ణ, ఎల్.సాంబమూర్తి, తాతారావు, బి.అప్పారావు, పి.శ్రీనివాసరావు, మేఘన, తదితరులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతి అందిస్తున్న వైద్యులు త్రినాథరావు, వరలక్ష్మి, వేదిక సభ్యులు

క్విజ్ విజేతలకు బహుమతుల పంపిణీ

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెంలో కృష్ణాష్టమి సందర్భంగా శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో గరివిడి జట్టు ప్రథమ స్థానం సాధించినట్లు క్విజ్ మాస్టర్ కర్రి రాము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తర్వాతి స్థానాల్లో గుర్ల, విశాఖపట్నం జిల్లా మద్దిలపాలెం, విజయనగరానికి చెందిన సిందూరీ రీడింగ్ రూమ్, విశాఖపట్నం జిల్లా అక్కిరెడ్డిపాలెం జట్లు నిలిచాయని చెప్పారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిక్కాన దేముడు, కోన నాగరాజు, నల్ల శ్రీరాములు, తిక్కాన గోపాలకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.



గరివిడి జట్టు సభ్యులకు మెమొంటో, నగదు అందజేస్తున్న నిర్వాహకులు

గౌతు లచ్చన్న ఆశయ సాధనకు కృషి చేయాలి



గౌతు లచ్చన్న చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న కల్లుగీత కార్మికుల సంఘ నాయకులు

- గీత కార్మికుల సంఘ గౌరవ అధ్యక్షుడు పురం అప్పారావు

గంట్యాడ: సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకు గీత కార్మికులు కృషి చేయాలని గీత కార్మికుల సంఘ గౌరవ అధ్యక్షుడు పురం అప్పారావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో లచ్చన్న జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లచ్చన్న శ్రీకాకుళం జిల్లా బారువ గ్రామంలోని నిరుపేద కుటుంబలో జన్మించి క్విట్ ఇండియా పోరాటాలతో సహా అనేక పోరాటాల్లో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో కొలుసు కస్తూరి, కాలా కృష్ణ, కొల్లి అప్పారావు పాల్గొన్నారు.

లచ్చన్న జీవితం ఆదర్శప్రాయం..

లక్కవరపుకోట: స్వతంత్ర సమరయోధుడు, మాజీ మంత్రి గౌతు లచ్చన్న జీవితం ఆదర్శప్రాయమని మహాత్మ జ్యోతిభాపూలే వెనుకపడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమర్‌పాత్రో అన్నారు. గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అనే బిరుదే పొందిన వ్యక్తి లచ్చన్నేనని చెప్పారు. కార్యక్రమంలో బోధనా సిబ్బంది పాల్గొన్నారు.



లక్కవరపుకోట: సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థినులు, బోధనాసిబ్బంది

స్వాతంత్ర్య వేడుకల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు

వేపాడ: విజయవాడలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా నిర్వహించిన పరేడ్‌లో బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. దీంతో విద్యార్థులు ఎల్. భవ్యశ్రీ, పి.యాహూశ్య, జి.కుమారస్వామిలను ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు శనివారం ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా నుంచి ఏడుగురు విద్యార్థులు పరేడ్‌కు వెళ్లగా..అందులో ముగ్గురు తమ పాఠశాలకు చెందిన వారు కావడం గర్వకారణమని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



పరేడ్ విన్యాసాల్లో పాల్గొన్న వేపాడ విద్యార్థులు

యువత సన్మార్గంలో నడవాలి

విజయనగరం టౌన్: యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా సన్మార్గంలో నడవాలని పాస్టర్ అలజంగి రవికుమార్ కోరారు. ఫ్రీడమ్ ఇన్ క్రైస్ట్ యూత్ రిట్రీట్ కార్యక్రమాల్లో భాగంగా స్థానిక యేసు ప్రేమాలయం చర్చిలో క్రీస్తు ఆరాధన పాటల పోటీలు శనివారం నిర్వహించారు. యూత్ ఫర్ జీసస్ బృందం ఏసుప్రభువును స్తుతిస్తూ చేసిన గీతాలాపనలు ఆకట్టుకున్నాయి. అనంతరం యువతను ఉద్దేశించి, పాస్టర్ ప్రసంగించారు. ప్రస్తుత ప్రపంచంలో యువతీ యువకులు ఫ్యాషన్ మాయలో పడి చెడు అలవాట్లు అలవర్చుకుని జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, ప్రతిఒక్కరూ మంచి నడవడిక కలిగి ఆదర్శవంతమైన జీవనం సాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.ఎస్.స్వరూప్, డాక్టర్ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు. పాటల పోటీల్లో విజయనగరం సిమ్స్ చర్చి, దాసన్నపేట చర్చిలు వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందాయి.



పాటల పోటీల్లో పాల్గొన్న క్రీస్తు ఆరాధకులు